క్లుప్తంగా

అన్నసమారాధన

కడియం: కడియపులంకలోని హరిహర మహా క్షేత్రంలో కార్తిక సోమవారం, త్రయోదశిని పురస్కరించుకుని భారీ అన్నదానం నిర్వహించారు. క్షేత్రంలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయంలో ఏటా ప్రత్యేక పూజలు, అన్నదానం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఖోఖో పోటీలకు ఆదిలక్ష్మి ఎంపిక

ప్రకాశం నగర్: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనల్ బీఎస్సీ చదువుతున్న వి.ఆదిలక్ష్మి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కోలేజియేట్ టోర్నమెంట్ ఉమెన్ టీమ్ సెలక్షన్స్‌లో జాతీయ ఖోఖో టోర్నమెంట్‌కు ఎంపికైంది. ఈ విషయాన్ని కళాశాల పీడీ వై.సుధారాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. తమిళనాడులో ఈనెల 26 నుంచి 30 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చిరస్మరణీయుడు కందుకూరి

ప్రకాశం నగర్: బాల వితంతువులుగా మారిన ఎందరో బాలికల జీవితాల్లో వెలుగులు నింపిన కందుకూరి వీరేశలింగం పంతులు చిరస్మరణీయుడని విశ్రాంత ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీరామమూర్తి అన్నారు. హితకారిణి సమాజం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కందుకూరి సమాధుల వద్ద నిర్వహించిన సంఘ సంస్కరణ దినోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్త్రీల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు కందుకూరి అని కొనియాడారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడు చీరల సీతారామయ్యానాయుడు, తెలుగు శాఖ అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

12 నుంచి చాంపియన్ షిప్

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ ఇంటర్ కాలేజీఎట్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ 2023– 24 పోటీలను స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల వేదికగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎబేల్ రాజబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పురుషుల, స్త్రీల అథ్లెంటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సుమారు 80 డిగ్రీ కళాశాలలు పాల్గొంటాయన్నారు.

ఈవీఎంలపై శిక్షణ

సీటీఆర్ఐ: జిల్లాలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఈవీఎంలపై శిక్షణ ఇచ్చినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎంలను సోమవారం రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీపాట్ యూనిట్లను ఇక్కడ భద్రపరచామన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కడియం: ద్వారపూడి – కడియం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం లభ్యమైందని కడియం పోలీసులు తెలిపారు. అతడి ఒంటిపై నాచు రంగు ఫ్యాంటు, సిమెంటు రంగుపై తెలుపు, ఎరుపు డిజైన్‌గల టీషర్ట్ ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం జీఆర్‌పీ ఎస్సై మావుళ్లను సంప్రదించాలన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి మహా రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

సీటీఆర్ఐ: గోదావరి గట్టున ఉన్న అన్నపూర్ణేశ్వరీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివేకానంద సనాతన ధర్మ ప్రచార సమితి ట్రస్టు ఆధ్వర్యంలో మహారుద్ర హోమం, లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ తొయ్యేటి సీతారామశర్మ దంపతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు కాకివారి కుటుంబ సభ్యులు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు దంపతులు, నందెపు శ్రీనివాస్, కోళ్ల అచ్యుత రామారావు, మద్దాల రవిశంకర్, బత్తుల రాజబాబు, గ్రంధి సత్యగోపాలకృష్ణ పాల్గొన్నారు.

పాడైన ఎలక్ట్రికల్ పరికరాలకు 14న వేలం

కంబాలచెరువు: ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీపీవో స్టోర్‌కు సంబంధించి పాడైపోయిన పాత ఎలక్ట్రానిక్ వస్తువులకు ఈనెల 14న వేలం వేస్తున్నట్లు ప్రకాశం నగర్ సీఐ పి.ఈశ్వర్ పవన్ కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.వెయ్యి డిపాజిట్ చేయాలన్నారు. వేలం పూర్తయిన తర్వాత వాపసు ఇస్తామన్నారు. వేలం దక్కించుకున్న వ్యక్తి వెంటనే సొమ్మును చెల్లించి పాత సామగ్రిని తీసుకోవాలన్నారు.

గోదారి తీరంలో కార్తిక శోభ

- ఘాట్లలో భక్తుల పుణ్యస్నానాలు
- ఆలయాల్లో విశేష పూజలు



పుష్కరాలరేవులో భక్తుల సందడి



నందీశ్వరుడికి పూజ చేస్తున్న మహిళ

సీటీఆర్ఐ: కార్తిక మాసం నాలుగో సోమవారం సందర్భంగా పుష్కరాల రేవు భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు పావన గోదావరి జలాల్లో పుణ్యస్నానాలు చేసి, రేవు మెట్లపై, రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అరటి దొన్నెల్లో దీపాలను వెలిగించి గోదావరి జలాల్లోకి వదిలారు. ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, భువనేశ్వరీ దేవికి కుంకుమార్చనలు చేశారు. శృంగేరీ శారదా శంకర మఠం ప్రధాన అర్చకుడు వెలవలపల్లి తాతయ్యశాస్త్రి చంద్రమౌళీశ్వరునికి పంచామృతాభిషేకాలు చేశారు. టి.నగర్‌లోని విశ్వేశ్వరస్వామి, సారంగధరేశ్వరస్వామి, ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



ఉమా మార్కండేయేశ్వరస్వామి ఘాట్‌లో పూజలు



గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు



దీపదానం చేస్తున్న మహిళ

మిషన్ ఇంద్రధనస్సు ప్రారంభం

ధవళేశ్వరం: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 16 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని గర్భిణులు, పిల్లలకు మిషన్ ఇంద్రధనస్సు ద్వారా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో జరిగిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమానికి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం.రాజకుమారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సెషన్లు ఏర్పాటు చేసి, 102 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, సీహెచ్‌వో శర్మ, శేషామణి, ఎంపీహెచ్‌ఈవో బాపిరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రగతికి తోడ్పడాలి

ప్రకాశం నగర్: వైద్యాధికారులు ప్రజారోగ్య పరిరక్షణకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై దృష్టి సారించి, ఆరోగ్య ప్రగతికి తోడ్పడాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బొమ్మూరు మహిళా ప్రాంగణంలో సోమవారం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ఆరోగ్యశ్రీ కార్డుల ప్రారంభ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

సేవామిత్రలకు నగదు పురస్కారం



కాశీవిశ్వనాథ్‌కు చెక్కు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నిబద్ధతతో సేవలందించే సేవామిత్రలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నగదు ప్రోత్సాహం అందిస్తున్నామని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆగస్టులో మెరుగైన సేవలు అందించిన ఆరోగ్యమిత్రగా ఎంపికైన గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) చెందిన డి.కాశీ విశ్వనాథ్‌కు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.5 వేల నగదు పురస్కారం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే ఆరోగ్యమిత్రలు వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలను ఆరోగ్యశ్రీ కింద నమోదు చెయ్యడం ద్వారా ఆయా ఆసుపత్రుల అభివృద్ధి కోసం కూడా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సైనిక్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అఖిల భారత సైనిక్ పాఠశాలలో 2024 – 25 విద్యా సంవత్సరంలో 6 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆరులో ప్రవేశం పొందే వారికి 2024 మార్చి 31వ తేదీకి 10 నుంచి 12 ఏళ్లు ఉండాలన్నారు. తొమ్మిదిలో ప్రవేశానికి 2024 మార్చి 31వ తేదీకి 13 నుంచి 15 ఏళ్లు ఉండాలన్నారు. పరీక్ష రుసుము జనరల్, రక్షణ సిబ్బంది, మాజీ సైనికోద్యోగులు, ఓబీసీలకు రూ.650, షెడ్యూల్ కులాలు, తెగలకు రూ.రూ.500 ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 16 వరకూ సమయం ఉందని, వచ్చే ఏడాది జనవరి 21వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పేదలకు భూములపై సర్వహక్కులు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియంలో భూ పట్టాల పంపిణీ

కడియం: భూములపై పేదలకు సర్వ హక్కులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. అసైన్డ్, ఈనాం, లంక భూములకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను సంబంధిత పేదలకు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక గిరజాల కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ కల్పించిన హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కడియం మండలం వేమగిరి లంక భూముల్లో 458 పట్టాలు, కడియపులంకలో 762 ఈనాం పట్టాలు, వేమగిరిలో 35, వీరవరం 250, కడియంలో 16 మంది పేదలకు చందన చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు మాట్లాడుతూ దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలకు భూయాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేయడానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ పేదలకు వెన్నుదన్నుగా ఈ ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు బత్తుల రాము, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, సాపిరెడ్డి కామేష్, రాణా హరిశ్చంద్ర, బట్టు చిన్ని, వార రాము, ఊటుకూరి శైలజ, బోడపాటి సత్యనారాయణ, అరేటి వెంకట్రావు, శాకా పట్టాభి, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నకుమారి పాల్గొన్నారు.



పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



చిన్నారికి ఆర్థిక సాయం చేస్తున్న చందన నాగేశ్వర్

చిన్నారికి ఆర్థికసాయం

కడియంలోని మేకలదిబ్బ ప్రాంతానికి చెందిన మండా దుర్గాప్రసాద్, దేవిల కుమార్తె రమ్యశ్రీ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ చిన్నారికి రూ.5 వేలు ఆర్థిక సాయంగా అందించారు. సోమవారం కడియం విచ్చేసిన ఆయన చిన్నారిని పరామర్శించారు. తన వంతు సాయంగా బాధిత చిన్నారికి ప్రతినెలా ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో అభివృద్ధి అద్భుతం

- మంత్రి ఆదిమూలపు సురేష్
- ఎంపీ భరత్‌రామ్, కమిషనర్‌కు అభినందన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అభివృద్ధి పనులు అద్భుతంగా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఇందుకు కృషి చేస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్, నగర కమిషనర్ కె.దినేష్ కుమార్‌ను అభినందించారు. సోమవారం అమలాపురంలో ఒక కార్యక్రమానికి వెళ్లేందుకు వచ్చిన ఆయన నగరంలోని ఒక హోటల్లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్, కమిషనర్ దినేష్ కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆర్ఎంసీ ఎకో మాస పత్రికను మంత్రి సురేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎస్.పాండురంగారావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు పరిశీలన

గోరక్షణపేట ప్రధాన రహదారిలో రోడ్డు కుంగిపోవడానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులకు ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. కుంగిన రోడ్డును సోమవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారిలో పైప్‌లైన్ ఉండటం వల్ల రోడ్డు మధ్యలో కుంగిపోయి ఉంటుందని పలువురు తెలిపారు. ఎంపీ ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. పైప్‌లైన్ వల్ల జరిగిందా, మరేమైనా లోపం ఉందా అనే విషయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు ఉన్నారు.

తిరుమలరావుకు పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: పితృవియోగంతో బాధపడుతున్న తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావును రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ పరామర్శించారు. సోమవారం ఆయన కాతేరు గ్రామంలోని తిరుమలరావు నివాసానికి వెళ్లారు. చంద్రశేఖరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. తిరుమలరావు, ఆయన సోదరులు నున్న కృష్ణ, సురేష్‌ను పరామర్శించారు. అలాగే రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పలువురు బీజేపీ నాయకులు తిరుమలరావును పరామర్శించారు.

పలువురికి ఎంపీ పరామర్శ

సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక 38వ వార్డు నేత ఉదయ్ రాణాను ఎంపీ మార్గాని భరత్ రామ్ పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ నగర యువజన విభాగం అధ్యక్షుడు పితా రామకృష్ణ తండ్రి బాబూరావు అస్వస్థతకు గురై జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను ఎంపీ భరత్ పరామర్శించారు. ప్రమాదంలో కాలికి గాయమైన బొల్లేపల్లి వీరభద్రరావును దివాను చెరువులో ఇంటికి వెళ్లి పరామర్శించారు.



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్, ఎంపీ భరత్ రామ్, కమిషనర్ దినేష్‌కుమార్



నున్న చంద్రశేఖరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో నున్న తిరుమలరావు

జగన్ పాలనలో అందరి అభ్యున్నతి

సీటీఆర్ఐ: అంబేడ్కర్, పూలే ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని మాలమహానాడు జాతీయ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి జగన్ కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారని, ఇచ్చిన హామీలను 90 శాతం పైగా పూర్తి చేశారన్నారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలసి కట్టుగా వచ్చినా, వారి మాటలను రాష్ట్రంలో ఏ ఒక్కరూ వినే పరిస్థితి లేదన్నారు.

స్పందనకు ఏడు అర్జీలు

ప్రకాశం నగర్: అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) డివిజన్ తహసీల్దార్ డి.సుగుణ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ రెవెన్యూ, పారిశుధ్యం, తాగునీటి పైపులైన్, భూ రీసర్వే, డ్రైనేజీ పైపులైన్ తదితర సమస్యలపై ఏడుగురు అర్జీలు అందజేశారన్నారు.

క్రీడాసంబరం.. నృత్యోత్సాహం





వెయిట్ లిఫ్టింగ్‌లో పోటీలో పాల్గొన్న క్రీడాకారిణి, ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

రాజానగరం: పగలంతా ఆటల్లో తమ తమ సత్తాను చాటి విజేతలుగా నిలిచేందుకు పోరాడుతున్న క్రీడాకారులు.. సాయంత్రం వేళలో సాంస్కృతిక ప్రదర్శనలలో కూడా పోటీపడుతున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజులుగా క్రీడోత్సాహం వెల్లువిరుస్తోంది. నాలుగు రోజుల పాటు జరిగే సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీలు యూనివర్సిటీలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాలలోని 90 యూనివర్సిటీల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరంతా పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పోటీల సమయం ముగిసిన నన్నయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలిస్తూ సందడి చేస్తున్నారు.



సావరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన శివలింగాకృతి

కార్తిక దీపోత్సవం

కడియం: స్థానిక సావరం సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పువ్వుల వ్యాపారి దుర్గారావు ఆధ్వర్యంలో వివిధ రకాల పువ్వులతో ఏర్పాటు చేసిన శివలింగాకృతి ఆకట్టుకుంది. భారీ ఎత్తున గ్రామస్తులు కార్యక్రమానికి హాజరయ్యారు.

బుచ్చయ్య విమర్శలు హాస్యాస్పదం



కడియం: రూరల్ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రజలకు అందుబాటులో లేని గోరంట్ల బుచ్చయ్య చౌదరి... ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు గిరజాల వీర్రాజు అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి ఎవరో తనకు తెలియడం లేదని, ఎక్కడా రైతులకు అందుబాటులో లేరంటూ బుచ్చయ్య చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సాయం, అప్పటి మీ టీడీపీ అందించిన సాయంపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న మేలుపై గోరంట్ల అవగాహన పెంచుకుంటే మంచిదన్నారు.

సునీల్ కుమార్‌కు డాక్టరేట్



కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి దువ్వూరి సునీల్ కుమార్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆ వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు సోమవారం తెలిపారు. మొబైల్ అడ్ హక్ నెట్‌వర్క్‌లలో ఫాల్ట్ టాలరెంట్ రూటింగ్ ప్రొటోకాల్ కోసం మెషిన్ లెర్నింగ్ ఆధారిత విధానం అనే అంశంపై చేసిన పరిశోధనకు సునీల్ కుమార్‌కు డాక్టరేట్ లభించిందన్నారు. తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందించిందన్నారు.

సమర్థ పాలనకు నిదర్శనం జగన్



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



బొగ్గులదిబ్బ సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న మింది నాగేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: నిజాయితీ, నిబద్ధత, సమర్థ పాలనకు నిదర్శనంగా జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలో సచివాలయాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11వ డివిజన్ 26వ నంబర్ మల్లిన నగర్ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు రూ.9.29 కోట్లు, 38వ డివిజన్ పరిధి 70వ నంబర్ సీతంపేట సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు రూ.17.76 కోట్లు, 50వ డివిజన్ పరిధి 95వ నంబర్ సచివాలయంలో రూ.15.05 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమయ్యాయన్నారు. కార్యక్రమాల్లో క్లస్టర్ ప్రెసిడెంట్లు పోలు విజయలక్ష్మి, పెంకే సురేష్, అజ్జరపు వాసు, మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు మానే దొర బాబు, బర్రే కొండబాబు, గుత్తుల మురళీధర్, అరిగెల బాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర అన్నారు. బొగ్గులదిబ్బ పరిధిలోని 17వ డివిజన్‌లో 42వ వార్డు సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆయన, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమౌళి) ఆవిష్కరించి, అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పార్టీ శ్రేణులతో కలిసి మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. డివిజన్ ఇన్‌చార్జి చీకురుమిల్లి చిన్న, సచివాలయం కన్వీనర్లు రొంపిచర్ల రమేష్, గుడివాడ ప్రేమ్ కుమార్, పండు, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దోనిపాటి రాజేష్, జువ్వల నాగేశ్వరరావు, షేక్ ఇమామ్ (బాబ్జీ), బాబ్జీరెడ్డి, పడమటి కామరాజు పాల్గొన్నారు.